నలుగురు, ఐదుగురు, ఎనిమిది.... పది. పన్నెండుమంది పిల్లలు.

ఆరేడేళ్ల వయసునుంచి పన్నెండేళ్ల వరకు ఉన్నారు ఆ మూకలో.

"మాటలొచ్చు! మాటలొచ్చు.... డబ్బులెయ్యకండి." పిల్లలొక్కొక్కరూ ఆ మాటలే అంటున్నారు. చివరకది ఓ పాటలా వినపడుతోంది.

"మాటలొచ్చు! మాటలొచ్చు!"

పిల్లలు గేలిచేస్తున్నారు. వెంబడిస్తూనే ఉన్నారు.

'ఏయ్ పాపా! రిక్షాకింద పడతావ్ జాగ్రత్త! తప్పుకో!' రిక్షా వెళ్లిపోయింది.

వీధి చివరకొచ్చేశాడు బిచ్చగాడు. మూక కొన్ని గజాల వెనక వస్తూనే ఉంది.

"ఏయ్! నీకు బుద్ధిలేదూ.... పిల్లలతోనా నీ ఆట...." ఒక పాప తండ్రి పాపను తనతో తీసుకుపోయాడు.

పిల్లల ఈసడింపు పాట మళ్లీ మొదలైంది.

వీధిచివర ఇంటిదగ్గర గంట వాయిస్తూ ఉంటే పిల్లలు వాడిచుట్టూ గుమిగూడారు.

ఇంటి లోపలినుంచి ఒక యువకుడు వచ్చాడు. కాలేజీ విద్యార్థిలా ఉన్నాడు.

గుమ్మం దిగి మూగవాడిని చాచి ఫెట్‌మని లెంపకాయ కొట్టాడు.

"అఁయా.... అఁ.... అ.... యా"_ మూగవాడు గోలపెట్టేశాడు. వాడి పళ్లెంలోని డబ్బులు ఎగిరి రోడ్డుమీద జల్లుకుపోయాయి. వాడి కంటిలో నీళ్లు. బుగ్గ తడుముకుంటున్నాడు.

_మూగవాడిని కొట్టడానికి బుద్ధిలేదూ! నీకు చదువు చెప్పిస్తున్నది ఇందుకేనా.... ఊరుకో బాబూ.... ఇంద.... ఈ పావలా తీసుకో.... జేబులోంచి తీసి యిచ్చాడాయన.

_"మాటలొచ్చు! మాటలొచ్చు!"

లాగుతో పాకలోనుంచి వచ్చిన కుర్రాడి నాయకత్వం విజృంభించింది.

"ఎవడికిరా మాటలొచ్చు! ఏదీ మాటాడించు!" తప్పున లెంపకాయ కొట్టాడా పెద్దమనిషి. పాకలోనుంచి వచ్చిన కుర్రాడు బిక్కచచ్చిపోయాడు.

పిల్లలంతా ఎక్కడివాళ్లక్కడకు మెల్లగా జారుకున్నారు. వీధి నిర్మానుష్యం అయిపోయింది.

మూగవాడు రెండు వీధులు దాటాడు. చెరువుగట్టు దగ్గరకొచ్చాడు. గట్టుమీద టీ బడ్డీ.


_'రెండు పుణుకులు.... టీయే.... అర్ధరూపాయైపోద్ది. పదిరూపాయలొట్టుకెళ్ళకపోతే అయ్య బొమికలేరేస్తాడు...'

ఉస్సురంటూ కూలబడ్డాడు బల్లమీద.

"నీకు మాటలొచ్చు! మాటలొచ్చు_"

లాగు కుర్రాడు బుగ్గ తడుముకుంటూ అన్నాడు మెల్లగా. బిచ్చగాడి కది వినిపించలేదు. బడ్డీ దగ్గర మనుషులకు అవి బోధపడినట్టూ లేదు.

———



# దేవుడిలాటోడు!

మంధా వెంకట రమణారావు

ఆ తోటలోని చెట్ల ఆకులమీద ఉదయపు ఎండ బంగారుపొడిలా పరుచుకుంది. చెట్ల నీడ నేలమీద సిరాలా పాకుతోంది.

గాలి వీచి, కొమ్మలు కదలాడినప్పుడు ఆకులమీద నీడ, నేలమీద ఎండా పడి, బంగారం సిరాగానూ, సిరా బంగారంగానూ మారుతున్నాయి.

అన్ని లక్షల ఆకులు గాలికి ఊగిసలాడుతూ, స్త్రీపురుష కంఠాలు ప్రేమతో గుసగుస లాడుకుంటున్నట్టు సడి చేస్తున్నాయి.

ఆ తోట ఊరవతల పాడుబడ్డ శివుడి కోవెల దాటాక, బోడికొండ పాదాలదగ్గరుంది. అది మామిడితోపే ఐనా, తోట చుట్టూ కంచెలా జామి, నేరేడు, ఉసిరిక, చింతచెట్లు దట్టంగా పెరిగి కాలానుగుణంగా కాపు పెడుతున్నాయి.

పాడుపడ్డ కోవెలలానే తోటకూడా సంరక్షణ లేక చిట్టడవిలా మారింది.

పుట్టలలోనుంచి పాములు బుసలుకొడుతూ రాకపోకలు సాగించగా, చెట్లమీద రామచిలుకలు, మైనగోరలు, పిగిలి పిట్టలు ఎంతో తొందరపడుతున్నట్టు ఎగిరి ఎటోపోతూ అంతలోనే తిరిగివచ్చి వాలుతున్నాయి.

ఎర్రచీమలు బారులు బారులుగా మామిడిచెట్ల మీదకి దండయాత్ర సాగించగా, చలిచీమలు చచ్చిపడిన పక్షుల మృతదేహాలని దొలుస్తున్నాయి.

పండి రాలిన పళ్ళు చివికి చివికి ఉన్నాయి.

ఆ పళ్లని ఏరి ఒడిలో వేసుకుంటోంది పదహారేళ్ళ కన్య- లేడి కళ్ళ వంటి అమాయకమైన కళ్లు, సంపెంగ పువ్వువంటి నాసిక, దొండపండువంటి పెదవులు, చిక్కితే పాలుగారే చెక్కిళ్లు, త్రాచుపామువంటి పెద్ద జడ, ఈ ఉపమానాలన్నీ నల్లగా ఉన్నా, అమెకు సరిపోయినా అమె నెవరూ ఆ ఉన్నతస్థానం మీద కూర్చోపెట్టలేదు. గ్రామంలో అందరికీ అమె మాలసింగడి కూతురు చంద్రి. చెట్టుకున్న పండు చిలకకొరికితే రాలిపోయేది- అంటరాని పండు. ఐనా అందుకుందుకి చిలకలకి అభ్యంతరం లేదు. చిలకలని చేరనివ్వకుండా చుట్టూ ధైర్యమనే ముళ్ళదడి కట్టుకుంది. ఆత్మగౌరవం, పౌరుషం అనే కావలాదారున్ని పెట్టుకుంది;

అమె కట్టుకున్న పాత నూలుచీర ఎన్నోచోట్ల చిరుగులుపడ్డా కుట్లువేసి కట్టుకుంది. ఆ పాత చిరుగులుపడ్డ వలువ కూడా అమె సోయగాన్ని మాటుపెట్టలేక పోతోంది- రవిక లేకపోవడంవల్ల, గాలి రివ్వున వీచినప్పుడల్లా పైట కొద్దిగా తొలిగినప్పుడు అమె అందాలు చండ ప్రచండంగా వెలిగే సూర్యుడి దృష్టిలో పడ్డప్పుడు గౌరవ పురస్సరంగా సూర్యుడు మబ్బుల నడ్డం పెట్టుకుంటున్నాడు.

లేడిపిల్లలా చెంగు చెంగున గెంతులు వేస్తూ అమె నేలపడిన పళ్ళు ఏరుతూ ఒకసారి కొరికి వాటి రుచిని నిర్ణయిస్తూ, అరుచికరమైనవైతే కళ్ళు బిగించి, ముఖం చిట్లించి వాటిని దూరంగా విసిరేస్తూ, రుచి బాగుంటే చీరకొంగుని జోలెలా చేసి, దానిలో వేస్తూ, తన పనిలో తాను మునిగిఉంది.

ఎండు చిరుకులు దొరికుతే వాటి నేరి ఒకచోట పోగుగా పెడుతోంది.

"ఇయి ఒడ్డుగెడితే అమ్మ కూడొండుతాది। ఇంతకీ అయ్య నూకలొడ్డుగొస్తాదో నేదో। ఈ యేడు వారసాలు సాలక, వారిసేలలో పన్లులేక, అరిజనవోడంతా సగమాకలితో మాడుతూ సవ్వనేక బతుకుతున్నారు_కూడియాల నేకపోతే ఈ పల్లుదిని పొట్ట నింపుకోవాల। పెద్దదొరకారయ్య పనుల్నేవు పొమ్మన్నడు। యాడకి పోవాల? యాడకి పోయినా ఎవరికి పట్టినాది తవ౦ గోడు!" ఈ మబ్బు వంటి నిరుత్సాహం ఒక్క క్షణం ఆ చంద్రబింబం వంటి ముఖాన్ని కప్పింది.

ఒక్క క్షణమే. మరు క్షణం మబ్బు తొలగిపోయింది

"రెక్కల కస్టం చేసుకునోళ్లకి బెంగేల! బవునికి పదముంటదయ్య! అడవి బోల్డు పనులుంటయ్యంట! ఇయాలో రేపో సిమ్మడు పట్నంలోని కైదు నించి యిడుదలై పారొస్తడు-'నీ అన్న పారాగానే యేం సెయ్యాలో అలోసిత్తను!' అన్నదయ్య అనుకుంది.

చంద్రికి అన్న గుర్తుకు రాగానే గుండె గర్వంతో పొంగిపోయింది.

'అన్నయ కెంత దవిర్యం! గానాడట్టయేల తొందరపడ్డాడో. అరదంగాదు కిందటేడు పెద్దపండుక్కి. పెద్దదొరల్లుడు గయిర్రాజు తాగొచ్చి చీకటిమాటున నా నొంటరిగ పాకనో నుండగా సెయ్యట్టుకుంటే ఎవురూ అయిపునేదు! యెవరికీ ముందుకొచ్చి తన్ని తప్పించే దయిరం నేదు! ఛీ థు! ముండసచ్చినోడు! నాకు బయ్యంతో ఒనికిపోయి కేకలేస్తే గూడెంల ఒక్కమడిసీ అడ్డుకోనేదే- ఆ చనం యాడనుంచొచ్చినాడో సిమ్మడు! పులిలాగఎగిరి గయిర్రాజుమీద పడినాడు- రగతాలు కారినట్టు ఉతికేసినాడు! సంపేసును గాని, గూడెమంతా యాడనుంటిరో ఆ చనాని కూడిపడి అడ్డి రచ్చించిండ్రు- మన్నాడు పోలీసులొచ్చి అన్నని ఒట్టుకపోయిండ్రు!"

చంద్రి కళ్లవెంబడి ఈ క్షణం జలజలా కన్నీరు కారింది, అన్నని తలుచుకోగానే! అన్న పారొస్తే అయ్యకి పనగ్గాదు. అంతా అదే జూసుకుంటడు.

ఎక్కడ్నుంచో ఒక రంగురంగుల రామచిలక ఎగిరొచ్చి నిర్భయంగా చంద్రి భుజంమ్మీద వాలింది. చంద్రి ఉలికిపడింది_పట్టుతప్పి ఒడిలోని జాంపళ్ల కింద పడబోగా తమాయించుకొని పట్టు వదల్లేదు_రామచిలకని క్రీగంట చూసి దాని సాహసానికి అబ్బురపడింది. తన చేతిలోని జాంపండు దానికందించగా ముక్కుతో దానిని కొరకబోగా, ముక్కు వ్రేలికి తగిలి జివ్వుమనగా, జాంపండుని వదిలింది- చిలక ఎగిరిపోయింది.

చంద్రి మనసు అహ్లాదంతో పరవశించింది. చెట్టుమించి కోయిల కూత పెట్టగా అమె తిరిగి కూత పెట్టింది. గుడారం సిన్మా ఒచ్చిందీ పల్లెకి - పాతసినీమా అందులో ఈశ్వరుడూ' పార్వతీ. పార్వతిలాగే కూత పెట్టింది. పాటకూడాపాడింది. అన్న, అమ్మ, తనూ ఆ సినిమా కెళ్లేరు. అప్పుడు పాటలన్నీ ఎంతో బాగున్నాయి. కాని రాగం తీసింది చంద్రి. కోయిల మరి కూయలేదు.

అన్న రాగానే తన పెళ్లిగురించి నిశ్చయం చేస్తానందమ్మ. ఒకటే బెంగ అమ్మకి.

"సెంద్రి పెళ్లిమాటేంజేసినావ్? తవిటయ్య నీ కంటి కాన్నేదా? యింతకన్న మంచోడేడ జతపడతాడు?" అని రోజూ అడగడమే అయ్యని.

"సూదుమ! సిమ్మద్రావీ!" అంటాడయ్య.

తవిటయ్య గురిం చాలోచించింది చంద్రి. అడప్పుకి తమ్ముదొరస. పక్కూర్లో కూలినాలి జేసుకుంటున్నడు. బలంగ, బొద్దుగ్గుంటడు. యీలు దొరికినప్పుడల్ల గూడేనికొచ్చి కబుర్లాడుతూ కూకుంటడు. తనకేసి అదోమాదిరిగ జూసి నవ్వుతడు. తనకి సిగ్గేసి అమ్మ సాటున నక్కుతది. ఒకపాలడిగిండు.. "సెంద్రీ నానంటే యిష్టమా కాదా?" ఎవరూ నేరా తడక పాకల! తనేం చెప్పద్ది తనకేటి దెల్సు? యిష్టంనేదంటే కోపం సేత్తాడని బయ్యమేసి తలూపేసి లగెత్తుక లచ్చిమ్మకాడికి పోనాది! లచ్చిమ్మ యెదురింటి అంకయ్య బారియ–

తవిటయ్య మంచోడే! మరి కాదా? యేమో యెవుడి కెరుక? యిప్పుడందరూ మంచిగనే ఉంటరు. పెల్లయిపోనాక మారిపోతరు మొగోల్లు! గాసయితే "గయిర్రాజుని సంపుతాను" అంటూ కత్తి తీసి లగెత్తినాడే చంతి తెలగానే! అయ్యడ్డుపడి పట్టుగొని కదల్నియ్యనే! "అదిపాపం అద్నే తింటన్రా! సిమ్మన్న కైదుకొట్టుక పోనారు! నీకూ అదే బొద్ది! నీ అయ్యా అమ్మా దుక్కపడతరు! ఎల్లకుంద్రారే!" అంటూ కదల్నియ్యనే! "తవిటయ్య సానమంచోడే!" అందమ్మ! మంచోడే గామోసు! యెప్పుడొచ్చినా తిండానికి పకోడాలో, కరకజ్జమో, సెరుగ్గడలో, తాటితేగలో తెస్తనే ఉంటడు! టవుని కెల్లొచ్చినప్పుడల్లా బొట్టు, కాటిక, పగడరు, ముచ్చులరిబ్బన్లు "ఇయి సెంద్రికి" అని తెచ్చిస్తడు! "పెల్లయినాక యెట్టాగూ తప్పదు! యిప్పుడేలరా నీకు కరుసు?" అంటదమ్మ. "యిదో కరుసేటే అక్కమ్మా! నాను తాగను. సుట్ట కాల్చను. ఆ డబ్బులెట్టి యింటికొక్కాల్సిన వొస్తువుద్దెస్తే నష్టమేటి?" అంటడాడు!

ఒడినిండా జాంపళ్లు నిండేయి. సూర్యుడు, 'ఇంక ఇంటికెళ్లు! నా ఎండకి నీ ఒళ్ళు కందిపోతుంది! నీ ముఖం వాడిపోతుంది' అని హెచ్చరిస్తున్నట్లు బారెడు మీదకొచ్చి వేడిని ఎక్కువ జేసేడు.

ఆ వేడికి పక్షులు కిలకిల తగ్గించేయి, గాలి స్తంబించింది. కొండ తోట నిశ్శబ్దమనే ముసుగుని కప్పుకున్నాయి.

ఒడిలోని పళ్ళని ఒకసారి చూసుకుంది చంద్రి. ఆమె కళ్ళు చీకటి రాత్రి నాటి నక్షత్రాలలా మిలమిలా మెరిసేయి. ఓలమ్మో! సానా పల్లు దొరికినాయియేల! "కారయ్యదొర తోట కెల్లకే!" అని అమ్మ సెప్పినా యినకండ ఒచ్చినందుకు నష్టంనే! "పెద్దదొర పల్లకుండే మడిసిగాదు! అడి తోటల పండిన పల్లు ఎవుడు దీసినా దొరుకుతే సెమ్మాలొలుస్తడు! కజ్జిల్లో కొట్టిస్తడు! యింక గయిర్రాజుకి నీ మీద సానా గుర్రుగుంది! పెమాదం సుమా!" అందమ్మ.

"ఆ తోట కెవుడూ యెల్లడే! కావలావోడు నేడు! దెయ్యం తోట! నాకు దెయ్యమంటే బయ్యంనే! కింద పడిన సిదుగులూ, పల్లూ ఏర్తే నష్టమేటి!" అంటూ మొరాయించింది చంద్రి – నెలిడినాలయి పీలున్నప్పుడల్లా తోటకొచ్చి చిదుగులూ, పళ్లు ఏరి పట్టుకపోతూనే ఉంది.

నిన్న రేతిరి పెద్ద గాలేసి వారసం కురిసింది గందా! అందుకే ఇయాల యిన్ని పల్లూ, సిదుగులూ దొరికినయ్యి! రోజు గాలేసి బర్సం పడాల! అనుకుంది మనసులో–

కోయిలేల కుయ్యడం నేదో! దానికి కోపమొచ్చింది గావాల తనమీద. అది కూస్తే తనూ కూసినందుకు! కనిపించకండ కూస్తది! మా కాన్ది!

తలొంచుకొని ఒడిలోని పళ్ళని లెక్క చూసుకుంటూ, సంతోషంతో పొంగిపోతున్న చంద్రి, తన మీద పడ్డ నీడని మేఘమేసిందనుకుంది – మల్లా వారసం పడతాది గవాల అని ఆశ్చర్యపోయింది– యిప్పుడే ఎండ, అప్పుడే వారసమా అని విస్తుబోయి తలెత్తింది–నీడని పరికించి జూసి, "యిది మేగం నీడగాదే! యిదేటిది? దెయ్యం నీడనాగుంది! ఓలమ్మ తల్లో! దెయ్యమే గావాలా!" అనుకొని భయంతో కొయ్యబారిపోయి, వెనక్కి కూడా తిరిగి చూడక సాహసించలేక, నీడకేసి గుడ్లప్పగిస్తూ ఉండిపోయింది.

దెయ్యమనుకున్న ఆ కారానికి ప్రాణం వచ్చి, నీడ అనుకున్న దానికి రూపం వచ్చి, వెనుక నించి, బరువుగా బలంగా, బిగువుగా రెండు హస్తాలు ఆమె సున్నితమైన భుజాల మీద వేసి, బిగించి పట్టుకోగానే, కేకవేసి, గిరుక్కున తిరిగి చూసి భయంతో కొయ్యబారి పోయింది! ఆమె కళ్లలో ఇంతవరకూ మెరిసిన నక్షత్రాల మిలమిల మాయమవగా, యమభటుడ్ని చూసిన మానవుడి ప్రాణాంతకమైన భీతి చిమ్మ చీకటిలా చోటుచేసుకుంది.

ఆమెకు కనిపిస్తున్నవి తనకేసి క్రూరంగా కాటేయబోయే మహాసర్పం కళ్లలా చూసే రెండు అగ్నిగోళాల వంటి నేత్రాలు– ఆ కళ్లలో క్రూరత్వమే కాదు, ద్రౌపదిని కాంక్షించిన కీచకుడి కామం, సీత సిగ పట్టుకున్న రావణుడి లాలస, ముసికన్యని పెనవేసుకోబోయిన రాక్షసుడి కైపు మంటల్లా తన వేపు దూసుకొస్తున్నాయి.

ఆమె గిరుక్కున తిరగ్గానే ఆ కబంధ హస్తాలు మరింత బిగుసుకున్నాయి-ఎదురుగా ఉన్న, నల్లగా మహిషాసురుడిలా ఉన్న, బలిష్ఠమైన మానవాకారం ఒక చెయ్యి భుజంమీంచి తీసి సన్నంగా కూజా మెడలా ఆమె నడుమును బిగించి పట్టి వికటాట్టహాసం చేసింది.

ఆ నవ్వు పిశాచం నవ్వులా ప్రతిధ్వనించగా ఆమె జీవంలేని శిలలా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది.

“యెవుడబ్బగాడి తోటనుకున్నావే లంజా! తేరగా పళ్ళు దొబ్బుకపోదామనుకుంటివా? యిపుడెక్కడికి పోతావ్? సెయ్యట్టకుంటినని సీతా సావిత్రిల పోజెట్టి నన్ను చితక తన్నిస్తివే! యిపుడు నువు చేస్తున్న పనేటి దొంగదానా! సూపు! కోకలో ఏటి దాచినవో సూపు!” ప్రతి పదంలోంచి తొంగి చూసింది కోపంకాదు-ఎలక పిల్లికి దొరికినపుడు పిల్లికే నూటలాస్తే ఆ మాటల్లో కనపరిచే ధీమా, ఆనందం, వ్యంగ్యం! అతడిలోని కామతీవ్రత అగ్గిమీద గుగ్గిలం జల్లినట్లుగా మండి సెగలూ పొగలూ ఎగదన్నుతూ అతడి కళ్లని ఎర్రగా రక్తపు గోళాలలా మార్చింది-నోటినించి సారా వాసనలు ఘలి గబ్బుకంపులా నలుదెసలా వ్యాపిస్తోంది.

చంద్రి నిలువునా కొయ్యబారి పోయింది-కాళ్లలోంచి కంపరం-వెన్నుపూసలోంచి వణుకూ పుట్టుకరాగా అచేతనంగా ఉండిపోయింది.

“యేందాసేవ్ సీర కొంగునో! కోకిప్పు” అంటూ దుశ్శాసనుడిలా ఆమె చీరకొంగందుకున్నాడు.

ఒడిలోని పళ్లని వదిలేసింది చంద్రి. అవి బంగారు బంతుల్లా దొర్లుకుంటూ చెల్లా చెదరయ్యాయి. అతడు లాగిన లాగుకి చీర విడిపోకండా చీరను పట్టుకుంది. ఎంతో ప్రయాసమీద వణుకుతూ వెలువడ్డాయి ఆమె గొంతులో నుండి మాటలు-“నేలని పడ్డ పల్లు ఏరుకున్నా దొరా! నన్నొగ్గండి! మీ కాల్మొక్కుతా!” కళ్లవెంబడి జలజలా ముత్యాలలా రాలుతూ కన్నీరు.

ఆ ముత్యాలు, పందివంటి ఆ మానవత్వం లోపించిన మగాడికి అవసరం లేకపోగా, పైశాచిక ఆనందం, హింసాత్మకమైన తృష్ణ అతడిని ఊపేసేయి.


ఛెళ్ళున ఆమె చెంపమీద, గూబ పగిలేలా కొట్టేడు మగాడు.

ఆ దెబ్బకి ఆమె ముఖం ఝుమాలు మాని శోషవచ్చి పడిపోయే పరిస్థితిలో చీరమీద ఆమె పట్టు పూర్తిగా సడలిపోగా ఆమె చీర ఊడదీసి పక్కకి విసరేసేడు.

ప్రాణంకన్న మానానికే ఎక్కువ విలువనిచ్చే ఆ కన్య, తన నగ్నత్వం అతడి కామపూరిత దృష్టిని పడకుండా,








చేతులతో కప్పుకుందుకి ప్రయత్నిస్తూ చెట్లమాటుకి పొదలచాటుకి తడబడే అడుగులతో పరుగుతీసింది.

మానవ రక్తం రుచిమూసిన పులిలా, అమలిన స్త్రీ [illegible]త్వాన్ని కనులారా గాంచిన అతడు ఆమెను వెంబడించేడు.

మగాడు వేటాడుతున్నాడు - ఆడది వేటాడబడుతోంది.

ఆమె పిరుదులూ,తొడలూ,రొమ్ములూ అరమరిక లేకుండా క్షణకాలం కనిపిస్తూ కామాగ్ని పర్వతాన్ని వెన్నులో ప్రేల్చి చెట్ల చాటున మరుక్షణం మరుగవుతూ ఉండగా, ఒళ్ళు మరిచి ఉడుకుతూ పరుగులు తీసేడు ఆమె వెంట.

ఈ నగ్నత్వంతో, ఈ సిగ్గుతో, దేవుడిచ్చిన తనపట్ల శాపాలుగా మారిన ఈ అందాలని పల్లెజన మందరి ముందూ బహిరంగ పరచవస్తుందన్న భీతితో పల్లె వేపు పరుగుతీయలేక ఆమె కొండమీదకి పరుగుతీసింది.

రాళ్ళు తగిలి పడింది. ముళ్లు గుచ్చుకుని చిట్లినా లేచింది. ముళ్ళు గుచ్చుకుని సున్నితమైని పాదాలనుండి రక్తం కారుతున్నా ఆ బాధ, మానహరణ భయం ముందు మెదడుకెక్కలేదు.

చేతికందిన స్త్రీ మాంసం జారిపోయిందన్న కాముకుడి ఆకలితో, కసితో, మొండిపట్టుదలతో అతడూ కొండమీదకు పరుగుతీశాడు. పడ్డాడు కాని లేచాడు. ఆయాసం, ఎగశ్వాస వచ్చినా వాటిని లెక్కచెయ్యలేదు.

ఆమె పూర్తిగా అలసిపోయింది. కొండ ఎంతకీ తరగని ఎత్తుని సంతరించుకొని ఉంది. ప్రతి అడుగుకీ తరిగిపోతున్న శక్తి ఆమెది.

ఎంత ఎత్తెక్కినా ముక్తిలేదు. మగ జంతువునించి విముక్తిమార్గం లేదు.

నిస్సత్తువతో ఆమె నేలను తూలి, భూదేవిని పెనవేసుకొని కన్నీటితో ఆమెని తడుపుతూ చావుకేకలాటి కేక పెట్టింది. "నన్నొగ్గు! నన్నొగ్గు!"

అతడి నీడ ఆమెమీద పరుచుకుంది!

కొండలు నిశ్శబ్దత వహించేయి.

ప్రకృతీ, పక్షులూ, వృక్షాలూ తమకు పట్టనట్టూరుకున్నాయి.

సూర్యుడు పెద్ద మబ్బుని అడ్డుపెట్టుకున్నాడు.

* * *

ఆ సాయంత్రం సింగడు ఏడుస్తూ, మొత్తుకుంటూ పెద్దదొర కారయ్య యొక్క కోటవంటి ఇంటికి వెళ్ళేడు.

గేలు తిరిగిన జుత్తుతో, పొడుగాటి మీసంతో, ఒక పొడుగైన బలిష్టమైన శరీరం నావకొళంగా చుట్టకాలుస్తూ ఇంటి ముంగిలి తోగిల్లో పడకుర్చీలో సావకాశంగా కూర్చుంది ఆ వ్యక్తి పాదాల ముందు సాష్టాంగపడ్డాడు సింగడు రోదిస్తూ.

దగ్గరోనే పాలేర్లకు పనులు పురమాయిస్తూ నిల్చున్న గవర్రాజు సింగడ్ని క్రీగంట చూసి, గమనించనట్టు తన పనిలో మునిగిపోయాడు.

"ఏటయిందిరా సింగా! ఇంట్లో నూకల్నేవా! కొట్టంనుంచి సోలడు గింజలొట్టుకెల్లు! రేపు పెందలకాడే టవునుకెల్లి పంపులకి డీజిలొట్టుకరా!" అన్నాడు ఆ భారీశరీరం స్వంతదారైన కారయ్య తొణకకుండా, అల్లుడ్ని ఓ కంట కని పెడుతూనే!

"యేం సెప్పను దొరా! గోరం జరిగిపోనాది! నూకలకోసం రానేదు దొరా! నా బొట్టె సెంద్రికి గోరం జరిగిపోనాది!" ఆ మాటలంటూ మరింతగా ఏడవసాగాడు సింగన్న.

గవర్రాజు ముఖకవళికల్లో మార్పు లేదు. తనకేమీ పట్టనట్టు పాలేర్లతో మాట్లాడుతున్నాడు.

కారయ్య కొద్దిగా తడబడ్డాడు. గొంతులో చుట్టపొగ ఎగదన్ని దగ్గు రాగా, దగ్గునీ మాటల్నీ కలిపేడు. "యేటయిందిరా నీ బొట్టెకి? పాంకుట్టిందా! యెవుడన్నా సెయ్యెట్టుకున్నాడా? యేదయినా యేడుపు! సెప్పసన్నా సెప్పు!" పినుగు ధ్వనించే గొంతుతో కసిరినట్టన్నాడు.

"యీయేల పెందలకాడ పుల్లలేరుకుంటానని ఊరవతల కొండకాడ తవుంరి తోటకెళ్ళింది దొరా! ఒద్దే ఒంటరిగా యెల్లకే అని దానమ్మ యెంత సెప్పినా యినిపించుగోనే! అడవిల ఏ దెయ్యం పూనిందో, బూతం వోలిందో యేటో! ఒంటిమీదసీరకూడనేకండ లగెత్తుకుంటూ ఒచ్చినాది మద్దేనేనికి! యేటయిందే సెంద్రీ? అంటే సెప్పదు. పిచ్చిదాయిలా యేడస్తంది! నవ్వుతంది! కొప్పు యిప్పేసుకొని పీకేసుకుంటంది. తల నేలకేసి బాదుకుంటన్నాది! మనోళ్ళకం నోనే నేదు!" సింగడు తల నేలని కొట్టుకున్నాడు.

గవర్రాజు చిరునవ్వు నవ్వుకున్నాడు

కారయ్య తేలిగ్గా ఊపిరి తీసుకొని, చుట్టకొడి దులిపి, "హుం!" అన్నాడు. అంతా అర్థమైనట్టు తల తాటించాడు. "యెన్నిపాల్ల సెప్పాన్రా మా తోట కెళ్లొద్దని! తేరగా పడుందన్రా మా తోట! నీ కూతుర్సంగతొగ్గు! బేవార్సు నంజకొడుకులందరూ సీకటిపడంగానే తోటలపడి కాయలేటి, కట్టెలేటి అదే దొబ్బుకపోడం! గయిర్రాజూ!" అల్లుడ్ని అధికార ధ్వనితో పిల్చేడు కారయ్య.

గవర్రాజు తన మంతనాలాపి, "ఏంది మావా?" అన్నాడు అడకుపగా.

"యీపాలి ఆడయినా మగయినా తోటల దూర్తే గుడ్డలిప్పి కాల్లూ సేతులూ గట్టి తోట ఒలిపించరా! నువ్వసలు తోట కాడికేయెల్లడంనేదు! యెప్పుడు పొలమూ టవునూ పొలమూ టవునూ! ముండల్ని మరిగినావేట్రా టవునుల! ఏట్నిసంగతి!" అల్లుడ్ని అదమాయించాడు మావ.

"నన్నేంజెయ్యమంటావ్ మామా! పొలం ముక్కేమా ఆ దెయ్యాలతోటా? నా నాతోటనో అడుగెట్టను సుమా! ఓ పాలేర్ని పెట్టమంటే నువ్వినవు! ఉదయం టవునుకుపోయి ఎరువునెత్తుకొని రమ్మని నువ్వేగంద పంపితివి నన్ను? యింక ముండల్సంగతా? ఛూట్!" అన్నాడు గవర్రాజల్లుడు ముఖం చిట్లించి.

సింగడు లేచి చేతులు కట్టుకొని నిల్చున్నాడు. అల్లుడూ మామల సంభాషణ ఆగాక అన్నాడు.... "సత్తెం పలికినాడు సిన్నదొర! ఆది దెయ్యాల తోటే దొరా! నా బొట్టెమీద దెయ్యం వోలింది సందేగం నేదు! పెల్లిగాని కన్నెపిల్లలొన్నడుగుంటుంది ఆ తోటల దెయ్యం! నెల్లినాలకితం దండాసి బొట్టెకీ అట్టనే అయింది దొరా! గానది కోకూడ దీసుక యిట్టా లగెత్తుకరాలేలే!" మళ్ళా కన్నీరు కార్చాడు సింగడు.

"అయితే ఏటంటావురా సింగా! నా కాడ కేలొచ్చినావు! నీ బొట్టెని మా తోటల యెవుడు దూరమన్నాడు! నీమో, పామో, దెయ్యమో దాన్నట్టుగుంటే నా దన్రా నేరం? తప్పు సేసింది సాలక ఫిర్యాదివ్వడానికి కొచ్చినావంట్రా!" గొంతు హెచ్చించి, కోపం మాటల్లో జొప్పించి అరిచేడు కారయ్య — యింక సింగడి సిగ తనచేత చిక్కినట్టు.

ఆ మాట వినగానే సింగడే లెంపలేసు కున్నాడు. నాలిక కరుచుకున్నాడు—మరో సారి పెద్దదొర పాదాలముందు సాష్టాంగ పడి తల నేలని కొట్టుకున్నాడు— "యెంత మాట దొరా! అట్టగ నావంటే నానాలిక మీద పుండుపుట్టదా? తఁవఁరు దరమపెబువులు! తఁవఁరు సల్లగ జూస్తేనేముం సల్లగుందేది!"

"యీ బుద్ధి ఆ దినం ఏడకి పోనాదిరా? నా అల్లుడు నీ బొట్టె సెయ్యట్టగున్నడని అబద్ధమాడిందే? సితక తన్ని సావబాది నారే? మా పరవుబజా రైటినారే! యిప్పుడు నీ బొట్టెని దెయ్యం అట్టగుందని నాకాడ కొస్తే నానేం చేసేది? యింకా నయ్యం! తోటల దాన్ని నా అల్లుడు సెరచినాడని అబాండమేసినావ్ గావు!" అతి తాపీగా, హుందాగా మాటలనే ఈ పెలతో పెద్ద మనిషి తరహాగా పొడిచేడు కారయ్య, సింగడ్ని.

ఆ మాటలకి గిలగిల్లాడేడు సింగడు— మరింత కన్నీరు కార్చి తలబాదుకున్నాడు "దొరా! సత్తెపెమానంగ సెపుతున్నాను. ఆ దినం నాఇంటికాడ్లేను! తవరన్నదానికి మాం యేపాటోల్లం దొరా! చమించాల దొరా!"

"ఐతిప్పుడేటటవ్? నానేం బూత వొయిద్యుడ్నేట్రా నాకాడ కొచ్చినావ్" నీ బొట్టెని అడికి జూపు!"

"సూపించినా దొరా! యాబై రూకలిమ్మన్నడు? నేకపోతే వోరం దినాల్లోపల నా బొట్టెని దెయ్యం సంపుతుం దన్నడు! ఇల్లంత యెతుకుతే పావల్దబ్బు ల్నేవు! యాడనుండి దేను యాబై రూకలు మామేపాటి, మా బతుకు లేపాటి దొరా! వొర్సా వెత్తిగట్టేసినయి! పొలం పను ల్నేవు—యింటిల్లిపాదీ పస్తులు—యిప్పుడీ గెఅసారం పట్టుకుంది. తఁవఁరే దిక్కు! తఁవఁరే నా బొట్టెని కాపాడాల దొరా!" సింగడిగొంతు బొంగురుబోయింది.


"నన్నేం జెయ్యమంటావ్‌రా? నాకే బూత వొయిద్యం సాతయితే ఊరకే పెద్దును!" మీసాలు దువ్వుకుంటూ వ్యంగ్యం జోడించి చిరునవ్వు నవ్వుకుంటూ అన్నాడు కారయ్య.

"తఁవఁరి దొడ్డ మనసు నాకు తెల్దా దొరా! యీ కస్టంల తఁవఁరే నాకు దిక్కు! యాబై రూకలిప్పించి నా బొట్టె పేనాలు కాపాడండి దొరా! మీ కాల్లట్టు గుంటన్నాను!" కారయ్య పాదాలని పెన వేసుకున్నాడు సింగడు.

పాదాల్ని సింగడి గుప్పెటనించి విడి పించుకొని కారయ్య గాణిగేడు. "యేడ నుండిరా రొక్కం! నానో కుబేరుడై నట్టు ప్రెతి నంజకొడుక్కీ నా మీద కన్నే! పోలీసోల్లేటి, నువ్వేటి, ఆడేటి. తెల్లా రిన కాడ్నించి నా మీదకి లగెత్తడమే! నా కాడేం ఏడుకొండలోడి ఉండీ ఉందను కుంటూన్నారు మీరంతా? వొర్సాల్నేవు!








సేతెండి పోనాయి! యిదిసాల్నట్టు యీ అల్లుడు నా కూతురుకి కడుపుజేసి కూకు న్నాడు! ఆయాలో రేపో టవును కొట్ట గెల్లి అస్పిటల్ల జేర్చాల! అది కూతురు నవర్తాడింరట. ఎయ్య రూకలూ, బస్తాడు సన్నబియ్యం పంపమని కబురంపేడు తాసిల్దారుడు నా కొడుకు! యీల్లమ్మ! అం దరికీ నానే గనిపిస్తున్నాను!" రెచ్చి రంకెలువేసేడు కారయ్య.

గవర్రాజపుడు మామకి దగ్గరగా వెళ్ళి తీవ్ర నిరసన ముఖంలో కన్పట్ట జేస్తూ, అవేశం తెచ్చుగుంటూ పౌరుషం ప్రకటించేడు....... "మామా! యేందా మాటలు! నానేం మగాడ్ని కాదేటి? నీ బొట్టెని నా కంటగడితివే పువ్వులా పత్రీ ఎట్టి పూజెయ్యడానికా? పెల్లిజేస్తే మరి కడుపు రాదా? యీ బీదోడు యాబై రూకలడిగినాడని నన్ను రొకాయిస్తుంటివే 'యేంరా అల్లుడూ! మనవడ్నివ్వవేటి' పేనం దీస్తివే! అస్పత్రి సంగతి నాన్జూసుగుంటాను నువ్వంత బీదోడి వైతే. ఒరే సింగా! యిందు! నానిస్తున్నా దీసుకో! నీ కూతుర్కి వొయిద్యం సేయించు!" అంటు టవునుకి రాత్రెళ్ళి జల్సా చెయ్యడాని కుంచుకున్న డబ్బు లోంచి, జేబులోంచి యాబై లెక్కపెట్టి తీసి సింగడికిచ్చేడు గవర్రాజు.

మునుగుతున్నవాడికి నావ దొరికినట్టు ఆబగా ఆ డబ్బందుకున్నాడు సింగడు— కృతజ్ఞత అతడి ముఖంలో తాండవ మాడగా, గవర్రాజు పాదాలకు మొక్కి అన్నాడు సింగడు, "దేవుడి లాటోడివి! నీ బారియా పిల్లలూ సల్లగుండాల దొరా!" ఆ మాటలని పెద్దదొర పాదాలకి మరోసారి సాష్టాంగపడి నమస్కరించి గూడెంకేసి పరుగుతీసేడు.

———